క్లుప్తంగా

పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవులు

గుర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు సోమవారం సందర్శించారు.రికార్డులు,స్టేషన్ పరిసరా లను పరిశీలించారు.కేసులు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, తదితర వివరాలపై ఎస్ఐ నారాయణరావును ఆరా తీశారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించారు. స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిని అభినందించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమ్మర్‌క్రాస్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న ఈఓపీఆర్‌డీ శ్రీదేవి

కొత్తవలస: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఈఓపీఆర్‌డీ శ్రీదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 20వ తేదీ వరకు మండలంలో సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ కొనసాగుతుందని, గ్రామాల్లో బోర్లు, తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ ఏ.సత్యకిశోర్ మాట్లాడుతూ మండలంలోని 844 బోర్లు, 49 పీడబ్ల్యూఎస్ పథకాలు, 21 డైరెక్ట్ పంపింగ్ తాగునీటి మోటార్ల మరమ్మతులు, నిర్వహణ పనులను సుమారు రూ.1.50లక్షలతో చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామాల వారీగా షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



పీహెచ్‌సీ సిబ్బందితో ఏడీ నీరద

గజపతినగరం రూరల్: క్షయ నిర్మూలనకు వైద్యసిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఏపీ క్షయ వ్యాధి ప్రోగ్రామ్ ఏడీ డాక్టర్ నీరద సూచించారు. మండలంలోని మరుపల్లి పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రి పరిధిలో క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలను వైద్యాధికారులు సాయికృష్ణ, అనూజ్‌ను అడిగి తెలుసుకున్నారు. క్షయ రోగులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వైద్యం అందించా లని, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు.

పేదల ఆకలి తీర్చడంలోనే తృప్తి



ప్రజలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న ఎస్ఐ మహేష్, ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు

బొండపల్లి: పేదల ఆకలి తీర్చడంలోనే నిజమైన తృప్తి ఉందని ఫోకస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తల గౌరునాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ అధ్యక్షుడు సుగంధం రామశంకర్ ఆర్థిక సహాయం తో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో పాటు వివిధ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చిన వారికి భోజనాలు సమకూర్చారు. పోలీస్ స్టేషన్ వద్ద సుమారు వంద మందికి ఎస్ఐ యు.మహేష్ చేతుల మీదుగా ఆహార పొట్లాలు అందజేశారు. శ్రీకాకుళం ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ సింహాచలం, సభ్యులు ఎం.సూర్యనారాయణ, యాకల శ్రీరామమూర్తి, ఎస్.బద్రి, సత్యవతి,గౌరి ,శ్రీనివాసరావు,ఆనంద్ పాల్గొన్నారు.

రైల్వే జీఎం పర్యటన



కోమటిపల్లి రైల్వే గేట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం పరమేశ్వర్

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే స్టేషన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ రామేశ్వర్ (భువనేశ్వర్) సోమవారం రాత్రి సందర్శించారు. రైల్వే గేట్ పనులను పరిశీలించి, బాగా సేవలందించిన రైల్వే గేట్ కీపర్ కొని ఈశ్వరరావుకు రూ.3వేల నగదు బహుమతి అందజేశారు. రైల్వే జీఎం పర్యటన నేపథ్యంలో కోమటిపల్లిలో ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలని ఆయనకి వినతిపత్రం అందజేయాలని ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులు స్టేషన్ వద్ద ఎదురు చూశారు. సాయంత్రం వరకు ఆయన రాకపోవడంతో స్థానికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎప్పటికి పూర్తయ్యేనో...!

- ముందుకు సాగని పెదమానాపురం రైల్వే గేటు వద్ద ఆర్ఓబీ పనులు
- 2014 జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వంలో శంకుస్థాపన
- అప్పటిలోనే పనులు ప్రారంభమైనా నేటికి పూర్తికాని వైనం
- టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా పనులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 70 శాతం వరకు పూర్తయిన నిర్మాణం
- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించని పురోగతి
- నిత్యం అవస్థలు పడుతున్న ప్రయాణికులు



పెదమానాపురం వద్ద ముందుకు సాగని వంతెన నిర్మాణం



రైల్వే గేటు పడడంతో రెండు వైపులా నిలిచి పోయిన వాహనాలు

దత్తిరాజేరు:

మండలంలోని పెదమానాపురం రైల్వే గేట్ వద్ద ఆర్ఓబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి శంకుస్థాపన జరిగి దశాబ్దం గడిచినా నేటికీ పనులు పూర్తి కాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే పెదమానాపురం జాతీయ రహదారిపై రైల్వే గేట్ వద్ద ఆర్ఓబీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యా యి. కిలోమీటర్ మేర వంతెన నిర్మాణానికి 2014 జనవరిలో అప్పటి గజపతి నగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమైన తర్వాత ఎన్నికలు రావడం, రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో వంతెన నిర్మాణం కొంత కాలం వాయిదా పడింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం 2019 ఎన్నికలకు ముందు కొంతమేర పనులు చేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వంతెన పొడవును కిలోమీటరు నుంచి 1.5 కిలోమీటర్లకు పెంచి, నేషనల్ హైవే గ్రాంట్ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి. 70 శాతం మేర పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్త య్యాయి. మిగిలిన 30 శాతం పనులు పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వంతెన నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆర్ఓబీ పనులను పరిశీలించి, 2025 జనవరిలోగా నిర్మాణం పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టరు కొద్ది రోజులు పనులు చేశారు. తర్వాత ఏమైందో కానీ పనులు నిలిచిపోయాయి.చిన్నా, చితకా పనులు తప్ప మేజర్ పనులు అస్సలు జరగడం లేదు.

ప్రయాణికులకు ఇక్కట్లు

వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోక లు సాగిస్తుంటాయి. రోజుకు ఏడెనిమిది సార్లు రైల్వే గేటు పడుతుండడంతో ప్రయాణికులు సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. గేటు పడిన తర్వాత ఒక్కోసారి 30 నుంచి 40 నిముషాల వరకు ఆగాల్సి వస్తోంది. అత్యవసర సేవలందించే అంబులెన్స్‌లు అయినా ఆగాల్సిందే. వంతెన నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు గోతులమయం కావడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రయాణికులు, నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

త్వరలో పూర్తి చేయిస్తాం..

కాంట్రాక్టర్ సకాలంలో స్పందించకపోవడం వల్ల వంతెన నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. త్వరలో పనులను ప్రారంభించి పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటాం.

– విశాలగుప్త, ఆర్ఓబీ జేఈ

పాలకులు దృష్టి సారించాలి



పెదమానాపురం వద్ద ఆర్ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా పాలకులు దృష్టి సారించాలి. పనులు ప్రారంభమై దశాబ్దం గడుస్తోంది. నియోజకవర్గ ప్రజలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు రైల్వే గేటు కష్టాలు తప్పడం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనుల్లో వేగం పెంచాలి.

– రెడ్డి సింహచలం, కె.కొత్తవలస గ్రామస్తుడు

సేంద్రియ ఆకు కూరలు ఆరోగ్యకరం

- ఏపీఎం ఉమామహేశ్వరరావు



ఆకుకూరలు, కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

కొత్తవలస : సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఆకు కూరలు ఆరోగ్యకరమని మండల సమాఖ్య ఏపీఎం ఉమామహేశ్వరరావు అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని దెందేరు, గనిశెట్టిపాలెం, తుమ్మికాపల్లి, గొల్లలపాలెం, చీడివలస, దేవాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు పండిస్తున్నారని చెప్పారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ వెంకటరమణ, వ్యవసాయ కార్యకర్తలు శ్రావ్య, లక్ష్మి, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: ధర్మవరం గ్రామంలో 'అసోసియేషన్ ఆఫ్ డాక్టర్ కేర్ ఫర్ యూ' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ వి.శ్రీదేవి నేతృత్వంలో, గ్రామానికి చెందిన వైద్యులు కాపుగంటి సందీప్, కాపుగంటి లహరి సమన్వయంతో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్యవైశ్య సంక్షేమ సంఘం సహకారంతో నిర్వహించిన శిబిరంలో మ్యాక్సివిజన్, మహాత్మాగాంధీ ఆస్పత్రి వైద్య బృందం, కేర్ ఆస్పత్రి, వెంకట్ హ్యాపీ డెంటల్ క్లినిక్ వైద్యులు శరత్‌చంద్ర, హరిత, మద్దిరాల, సుదానంద, కె.సందీప్, సాయి లహరి, వి.శ్రీదేవి సేవలందించారు. 120 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించండి

- పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

బొండపల్లి: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీపీఎంలు, సిబ్బందిపై ఉందని విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లా శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గజపతినగరం పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన బీపీఎంలు, పోస్టల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర, బీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కొత్తవలస/లక్కవరపుకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో సోమవారం జోరుగా సాగింది.పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్ ఉపాధ్యాయసంఘం సభ్యులు కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లోని పాఠశాలల్లో ప్రచారం చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి.ఈశ్వరరావు,నాయకులు జి.వెంకటనాయుడు, సీహెచ్.రామసన్యాసిరావు, ఎల్.కోట, కొత్తవలస మండలశాఖ అధ్యక్షులు గాడి రవికుమార్, సీహెచ్.నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గాదెకు మద్దతుగా...

మెరకముడిదాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు సోమవారం ప్రచారం చేశారు. ఉత్తరావల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థులతో పాఠ్యాంశాలు చదవిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: ఓబలయ్యపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వర్క్‌బుక్స్ పరిశీలించడంతో పాటు వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. కిచెన్ గార్డెన్, మధ్యాహ్నభోజన వంటలను పరిశీలించి వంట నిర్వాహకులకు సూచనలు చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గంలో పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఎల్.కోటలోని తన నివాసంలో సోమవారం పంపిణీ చేశారు. కొత్తవలస మండలంలోని ముమ్మనవాని పాలెం గ్రామస్తుడు దుర్గా ప్రసాద్‌కి రూ.4,55,764, ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేటకు చెందిన సలాది సత్యంకు రూ.1,00,241, పెదఖండేపల్లి గ్రామస్తుడు భీమవరపు సూరిదేముడుకి రూ.32,100, కృష్ణాపురం గ్రామస్తుడు వియ్యపు హేమసాగర్‌కు రూ.40,000,ఎల్.కోట మండలం పోతంపేట గ్రామస్తుడు నాగభూషణ్‌కు రూ.1.03 లక్షలు మంజూర య్యాయి. కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు సరికాదు




తహసీల్దార్ బంగార్రాజుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): జర్నలిస్టులపై దాడులు సరికాదని స్థానిక జర్నలిస్ట్ సంఘ నాయకులు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై టీడీపీ నాయకుడు దాడి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజుకు వినతి పత్రం అందజేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

అర్హులకు ఉచిత విద్యుత్

వేపాడ: అర్హులైన దళితులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు సోమవారం ఓ ప్రక టన లో తెలిపారు. దళితులు 200 యూనిట్ల వినియోగం వరకు బిల్లు చెల్లించనవసరం లేదని పేర్కొన్నారు. సిక్స్ పాయింట్ పరిశీలనలో అనర్హులను గుర్తించామని, ఎవరికైనా పథకం వర్తించకపోతే సంబంధిత గ్రామ సచివాలయంలో సంప్రదిస్తే, ఎందుకు అనర్హులుగా గుర్తించారో సిబ్బంది తెలయజేస్తా రని స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ పథకానికి అర్హులు ఉంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.200 యూనిట్లు మించి వాడితే బిల్లు చెల్లించాల్సి ఉంటుందని, బిల్లులకు సంబంధించిన సమాచారం కోసం స్థానిక విద్యుత్ కార్యాలయంలో కానీ, ఫోన్‌లో 1912 నంబర్‌ను కానీ సంప్రదించాలని సూచించారు.

20న మెగా జాబ్‌మేళా



మెగా జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జాషువా జయప్రసాద్, అధ్యాపకులు

చీపురుపల్లిరూరల్(గరివిడి):గరివిడిలోని అవంతి సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీన అవంతీ కళాశాల, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్న ట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా జయప్రసాద్ తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్లను కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ,ఫార్మా, ఆటోమొబైల్స్, మ్యానుఫ్యాక్చరింగ్ రంగాలకు చెందిన 28 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. చీపురుపల్లి,గరివిడి, గుర్ల, మెరకముడిదాం, నెల్లిమర్ల, లావేరు, రాజాం, విజయన గరం తదితర ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7989826953, 7995691295,7997219987 నంబర్లను సంప్రదించాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో శ్రీరామ్ హైస్కూల్ 1986-87 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ హైస్కూల్‌లో 1986–87లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మే ళనం ఆపాఠశాల (ప్రస్తు తం ఉమెన్, చైల్డ్ వెల్ఫేర్ సెంటర్) వేదికగా సోమవారం జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా 38 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యా యంగా పలకరించుకుని, పరస్పరం కుటుంబ జీవితం గురించి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటిలో వారికి చదువుచెప్పిన గురువులకు మేళతాళాలతో స్వాగతం పలికి సన్మానించారు.

బడిమిత్రుల సేవా ట్రస్టు ఏర్పాటుకు శ్రీకారం

పూర్వ విద్యార్థులంతా కష్టసుఖాల్లో ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉండడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచనతో 'బడిమిత్రుల సేవాట్రస్టు' ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.ట్రస్టు ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ట్రస్టు ఏర్పాటుకు డాక్టర్ పి.వి.కృష్ణంరాజు,న్యాయవాది కారి గోవిందరాజు ముందడుగు వేయగా మిగిలిన పూర్వ విద్యార్థులంతా భాగస్వామ్యులయ్యారు.

అనువాద పుస్తకాల ఆవిష్కరణ

పూర్వ విద్యార్థిని, విశాఖపట్నంలోని శివాజీనగర్ లో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత డాక్టర్ మురహరరావు ఉమాగాంధీ ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదించిన రెండు కథల పుస్తకాలను శ్రీరామ్ హైస్కూల్ పూర్వ గురువులు ఆవిష్కరించారు.

సైబర్ నేరాలపై అవగాహన



పురిటిపెంట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జి.ఏ.వి.రమణ

గజపతినగరం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ ప్రజలకు సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పురిటిపెంట గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. ఫోన్‌లో ఎవరైనా బ్యాంకు ఖాతాల వివరాలు, లేదా ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. రోజురోజుకూ ఆన్‌లైన్ మోసాలు,సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.అలాగే అసాంఘిక కార్యక్రమా లకు పాల్పడే వారిపై, మద్యం తాగి గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితువు పలికారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ రమామణి

దత్తిరాజేరు: మండలంలో ఉపాధి హామీ పనుల నిర్వహణపై స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ఆ పథకం ఏపీడీ రమామణి సోమవారం సమీక్ష నిర్వహించారు. వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందేలా వారితో పనులు చేయించాలని సూచించారు.పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉంచాలన్నారు.వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వేతనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఓ వెంకటప్పలనాయుడు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సర్టిఫికెట్ల పంపిణీ



శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అప్పలరమణ,కర్మాగార ప్రతినిధులు

కొత్తవలస: కంటకాపల్లి గ్రామ సమీపంలోని శారద మెటల్స్, ఎల్లోయిస్ లిమిటెడ్ కర్మాగారం ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్‌డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో వివిధ వృత్తివిద్య కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 54 మందికి సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మదినా అప్పలరమణ, కర్మాగార ప్రతినిధులు సన్యాసిరావు, జి.శంకరరావు, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మెరకముడిదాం: కౌమార బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని స్థానిక కేజీబీవీ ఎస్ఓ గౌష్యాబేగమ్ సూచించారు. హైద రాబాద్‌కు చెందిన బాలమిత్ర ఫౌండేషన్ సమకూర్చిన శానిటరీ నాప్‌కిన్స్‌ను కేజీబీవీలో విద్యార్థినులకు సోమవారం పంపిణీ చేశారు. బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధులకు కేజీబీవీ ఉపాధ్యాయినులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు

మెరకముడిదాం: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను, చీపురుపల్లి ఐసీడీఎస్ పీఓ ఎం.రాజేశ్వరి తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో విద్యాశాఖ, ఐసీడీఎస్ సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు.ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మెరక ముడిదాం ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు అంతా హాజరు కావాలని కోరారు.

వైభవంగా దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ట

బొండపల్లి: గెద్దపేట గ్రామంలోని మల్లికార్జున మాధవ లింగేశ్వరస్వామి ఆలయంలో వినాయక, భ్రమరాంబిక, సుబ్రమణ్యేశ్వర స్వామి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

గజపతినగరం రూరల్: సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ కల్యాణి హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందన్నారు. అలాగే ఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, తదితరులు పాల్గొన్నారు

20 మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ, పాతబగ్గాం గ్రామాలలో మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను పట్టుకుని 20సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ జనార్దనరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ తన సిబ్బందితో ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో పాతబగ్గానికి చెందిన సంగిరెడ్డి శ్రీను, కెంగువ గ్రామానికి చెందిన బొంతుపైడిరాజులనుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి, ఎక్సైజ్ ఎస్సైలు నరేంద్రకుమార్, ఎస్.కొండలరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

వేపాడ మండలంలో 10 మద్యం సీసాలు

కొత్తవలస: వేపాడ మండలం కొండగంగుబూడి గ్రామం సమీపంలో ఎక్సైజ్ సీఐ జి.ఎస్.రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో అదే గ్రామానికి చెందిన ఎస్.సోమేశ్వరరావు 10 మద్యం సీసాలను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడినట్లు సీఐ రాజశేఖర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై వీఎస్.రాజు, సిబ్బంది సీహెచ్.ప్రసాద్, వీర్రాజు, బి.ఆదినారాయణ, జి.రమేష్, వి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీలు

వేపాడ: మండలంలోని మైచర్ల శింగవరం గ్రామంలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఆకట్టుకున్నాయి. విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 12 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి.మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు గ్రామపెద్దలు గొంపవెంకటరావు, కృష్ణ, అప్పలనాయుడు, ధనుంజయ,నాగరాజు,మైచర్ల అప్పన్నదొర, ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.